


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

100

(9 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఇటీవల** దేశంలో అంతరాతం ఆత్మగా మేల్కొంటోంది. ఈ అంతరాత్మ అనుకోకుండా రాజకీయాల్లోకి కూడా ప్రవేశించింది.

ఈ అంతరాత్మ పునర్జన్మ రాష్ట్రపతి ఎన్నికల సమయంలో మేల్కొల్పింది ప్రధాని ఇందిరాగాంధి. హఠాత్తుగా మేల్కొన్న ఈ అంతరాత్మ అనతి కాలంలో అఖండ విజయం సంపాదించ కలిగింది. "అమ్మో! అంతరాత్మా! నీకెంత శక్తివుంది?" అని దేశం విస్తుపోయింది.

ఇంకేం వుంది ప్రతి వ్యక్తి అంతరాత్మను మేల్కొల్పడం ప్రారంభించాడు. అంతిమ విజయం తథ్యమనే విశ్వాసంతో ప్రతివారు అంతరాత్మద్వారా కొన్ని ప్రయోగాలు సాధించడానికి ఉపక్రమించారు.

ఇందులో విచిత్రమేమిటంటే 'ఇంట గెలిచి రచ్చ గెలవమని శాస్త్రం వుంది గనుక చాలామంది ముందుగా ఈ నూతన అస్త్రాన్ని ఇళ్ళల్లో ప్రయోగించడం ప్రారంభించారు.

ఒక గృహస్థు భార్యను తెల్లవారు ఝామున లేపి "ఇవ్వాళ ఉదయం తొమ్మిదింటి కల్లా ఆవడలు తినాలి. లేచి మినప్పప్పు నానబొయ్యి" అన్నాడట.

"ఇదేమిటండీ రాత్రి నిద్రపోయేముందు పెసరట్టు తినాలని వుందని చెప్పారుగా! ఇంతట్లో ఈ మార్పేమిటండి?" అన్నదిట భార్య కళ్ళు నులుపుకుంటూ.

"అదంతా నాకు తెలియదు అంతరాత్మ తెల్లవారు ఝామున మూడున్నర ఆ ప్రాంతాల్లో నిద్రలేపింది. 'మాధవరావు? నువ్వు రేపు ఉదయం తొమ్మిదింటికి ఆవడలు ఫలహారం చెయ్యి. ఎంతో హాయిగా వుంటుంది అని చెప్పింది.' నేను దిగ్గునలేచి కూర్చున్నాను. నేను అంతరాత్మ నడిగాను. నేనప్పటి వరకూ వేరే ఫలహారం అనుకుంటున్నానే. ఇంతలో మార్చడం?"

"నీ మనస్సు అనుకుంటే అనుకోవచ్చు. దానికింత మధనపడతావెందుకు మాధవరావు? నేను ఆజ్ఞాపించిన తర్వాత, అన్ని ధర్మాలు వదిలి నేను చెప్పినట్లు చెయ్యవలసిందే అన్నది."

నేను బిక్కముఖం వేసి "మినప్పప్పు నానుతుందంటారా అన్నాను. "మినప్పప్పేమిటి? ఇనపగుగ్గిళ్ళు కూడా నానతాయి. అది నా ప్రభావం నువ్వు సంశయాలు పెట్టుకోవద్దు. సభ్యత ఆలోచించవద్దు. వెంటనే నే చెప్పినట్లు చెయ్యి. అంతిమ విజయం నీదే అన్నది. " అని ఆయన భార్యతో చెప్పాడు.

"అసలు మామూలుగానే చచ్చిపోతున్నాం. ఇందులో ఈ అంతరాత్మ గొడవ ఒకటి వచ్చి పడింది. ఇక ఎన్ని అవస్థలు పడాలో? " అని ఆమె లేచి వెళ్ళి మినప్పప్పు నానబోసిందిట.

ఉదయం తొమ్మిది గంటలకు భర్త కోరిన ప్రకారం ఆవడలు ఫలహారం చేసి భార్యను ఎంతో కొనియాడాడుట. "ఇకనుంచీ ప్రతీ ఆదివారం ఉదయం ఆవడలే చెయ్యి అన్నపూర్ణా అంతరాత్మచేత మాటిమాటికీ చెప్పించుకోవడం అంత బాగుండదు" అని ఆయన మిత్రుడింటికి వెళ్ళాడుట.

తిరిగి తిరిగి మధ్యాహ్నం వంటి గంటకు ఇంటికి చేరాడుట. భార్య పొయ్యిమీద అత్తెసరన్నా వడవెయ్యకుండా హాయిగా పడుకుని నిద్రపోతోందిట. మాధవరావు ఉలిక్కిపడి ఆవిణ్ణి లేపి "ఏమిటి ఇలా పడుకున్నావు? వంట చెయ్యలేదా?" అన్నాడుట.

"లేదు" అని ఆవిడ మరో వైపు తిరిగి పడుకొందిట.

మాధవరావు తనుకూడా అటువైపు వెళ్ళి "ఏమిటి? వంటిగంట అయింది. ఇంకా వంట ఎందుకు చెయ్యలా? అని ప్రశ్నించాడుట.

"ఆదివారంనాడు ఆవడలు తిని హాయిగా నిద్రపోండి. అన్నం మాట తలపెట్టకండి. అరక్క అవస్థపడతారు. రాత్రి కొంచెం వండుకు తినండి. ఆరోగ్య సూత్రాలు పాటించండి అని మీరు అలా వెళ్ళగానే అంతరాత్మ నన్ను పిలిచి గట్టిగా చెప్పిపోయిందండీ. 'అక్కడికి ఆయన వూరుకొంటారా?' అన్నాను. 'భయపడకు అంతిమ విజయం నీదే అని చెప్పిందండీ'" అని మళ్ళీ ముసుగు పెట్టుకొందిట. ఆ అరుణాదేవి ఇలా ఏదో ఒక సూచన చేసి చక్కా పోవడంకాదు. కొందరికి ప్రతి విషయంలోనూ సలహాలిస్తోందిట అంతరాత్మ. ఆ కారణం వల్ల వారు అంతరాత్మ సూచించిన మార్గంలోనే నడవడం ఏర్పాటు చేసుకుంటున్నారుట.

కొందరు అంతరాత్మ చెపితే సూచనలన్నీ జ్ఞాపకం ఉంచుకోలేక రికార్డు చేసుకుని వుంచుకోవడం జరుగుతూ ఉండవచ్చు. ఉండవచ్చునేమిటి? మొన్న ఒక పత్రికలో కార్టూను చూశాను. ఆ పెద్దమనిషి కాంగ్రెసు దుస్తులు ధరించి అన్నాడు.

నోట్లోకి ఒక గొట్టం పోనిచ్చి దాన్ని టేప్‌రికార్డుకు కనెక్టు చేసి కూర్చున్నాడు. ఇంతలో ఆయనకోసం ఎవరో వచ్చారు. భార్య వాకిట్లోకి వెళ్ళి "మావారు ప్రస్తుతం బయటికి వచ్చి మాట్లాడడానికి వీల్లేదు. ఆయన అంతరాత్మ చెప్పే విషయాలు టేప్ రికార్డు చేస్తున్నారు. మీరు మరోసారి వచ్చి కలుసుకోండి" అని చెపుతోంది.

మొన్న ఒకావిడ అంతరాత్మ విషయం వచ్చి ఇలా అంటోంది. "ఎంత అంతరాత్మ అయితే మాత్రం అలా సంచరించడానికి ఎలా వీలవుతుంది? మగవాళ్ళయితే అలాగే చెప్పుకోవచ్చు అది చెప్పినట్లు చెయ్యనూవచ్చు. ఆడవాళ్ళకు అది ఎలా సాధ్యమవుతుంది? "

"మాటవరుసకు చెపుతాను. ఆ గది నడివీధిని బడిపోతూ ఇంటిమాట మరిచిపోతే ఎలా కుదురుతుంది? అలా తిరుగుతున్నావేమిటి? సంసారం వదిలి, సంతానాన్నీ, పతినీ వదిలి" అని ఎవరన్నా ప్రశ్నిస్తే "నన్నేం చెయ్యమంటారు? అంతరాత్మ తిరగమంది నేను తిరుగుతున్నాను" అంటుందనుకోండి.

"అక్కడితో వదిలి వూరుకుంటారా? అంతరాత్మ మీద అభిమానం వుంటే వుండొచ్చుగాని ఆడదానిమీద ఉంటుందా? భర్త అనే మహావీరుడు పరుగెత్తుకు వచ్చి నాలుగు బాది ఇంటికి తీసుకుపోతాడు.

లేదా వూళ్ళో నలుగురూ ఏకమై ఫలానా లీలావతికి పిచ్చి పట్టిందని యాగీ చేస్తారు. "అంతరాత్మ" వుంటే మాత్రం వినిపించుకునేదెవరు? విలవ గ్రహించేదెవరు? అన్నదామె.

ఏది ఏమైనా అంతరాత్మకు చాలాపని తగిలింది కాలంలో. అంతరాత్మకు దోహదం చేసే శక్తులం వెనుక ఏమన్నా వుంటే ఉండవచ్చు. కానీ పేరుమాత్రం దానికే వస్తోంది. దేశంలో చాలామంది నిజానికి "అంతరాంత్మ"ను "ట్రేడ్‌మార్కు"గా వుపయోగించుకొంటున్నారు అంతిమ విజయం మాట ఎలావున్నా పంతంతో కొంత విజయం సంపాదించ కలుగుతున్నారు.

ఆత్మ, అంతరాత్మకూ మనవాళ్ళు వేదాంతంలో చాలా ప్రముఖమైన స్థానమిచ్చారు. ఈ రెండిటికీ పరమాత్మకూ దగ్గర సంబంధం వున్నదన్నారు. ఆత్మసాక్షికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు.

కాకపోతే ఆత్మ మంచి ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పుతుంది - గంభీర భావనతోననే అభిప్రాయం మార్చుకోవచ్చు. చిలిపి ప్రశ్నలు వేసుకున్నవారికి చిలిపి జవాబులు, స్వార్థం ప్రశ్నించుకున్నవారికి చిలిపి జవాబులు, స్వార్థం ప్రశ్నించుకున్నవారికి అందుకు సరిపోయే జవాబులు కూడా చెపుతుందనే సత్యం ఒకటి ఇప్పుడు బయట పడింది.

"మట్టికుండలోన మాణిక్యమున్నట్లు
వూపునందు దాని పొసగినట్లు
తమవునంటి యాత్మ తళతళలే విరజిమ్ము
నిక్కనురసి దావు వక్కణించె"

- అని శ్రీ ఎలమంచలి వెంకటేశ్వరరావుగారు 'హృదయ వాణి' అనే గ్రంథంలో వ్రాశారు. ఈ ఆత్మకు ప్రస్తుతం అమలులో వున్న 'అంతరాత్మకు' గల సంబంధమేమిటో విజ్ఞులు విచారించాలి.

Post your comments